క్లుప్తంగా

పెనుబాకలో పండగ సందడి



అమ్మవారి పీఠం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

రాజాం సిటీ: మండలంలోని పెనుబాక గ్రామంలో జరుగుతున్న గ్రామదేవత ఉత్సవాలతో పండగ సందడి నెలకొంది. మంగళవారం వేకువజామున మహిళలు అమ్మవారికి ముర్రాటలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. ఉద్యోగం, ఉపాధి మంగళవారం వేకువజాము వరకు ముర్రాటలతో ఊరేగింపు నిర్వహించారు. సాయంత్రం చేపట్టిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

25 నుంచి వంటీర్లకు సత్కారం

బాడంగి: మండలంలోని 18 గ్రామ సచివాలయాల పరిధిలో సేవలందిస్తున్న గ్రామ వలంటీర్లకు ఈ నెల 25 నుంచి జూన్ 3వ తేదీ వరకు సచివాలయాల వారీగా సన్మాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.అక్కారావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 25న రేజేరు, ఆనవరం, 26న వాడాడ, కోటిపల్లి, 27న బొత్సవానివలస, గూడెపువలస, 29న పాల్తేరు, భీమవరం, 30న గొల్లాది, గజరాయునివలస, 31న డొంకినవలస, తెంటువలస, జూన్ 1న వీరసాగరం, బాడంగి–2, 2వ తేదీన బాడంగి–1, ముగడ, 3న కోడూరు–1,2 సచివాలయాలలో సన్మాన కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

జేవీకే స్టాక్‌పాయింట్ పరిశీలన

బాడంగి: మండలం కేంద్రంలోని జగనన్న విద్యాకానుకలు (జేవీకే) స్టాక్ పాయింట్‌ను జిల్లా ఉపవిద్యాశాఖాధికారి ఎస్.తిరుపతిరావు మంగళవారం సందర్శించారు. పాఠశాలలకు కిట్ల సరఫరాపై సీఆర్పీ, ఐఈఆర్టీలకు సూచ నలు చేశారు. బాడంగి జిల్లాపరిషత్ హైస్కూల్ లో పదో తరగతి ఫెయిలైన విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. నిర్వాహకులకు సూచనలిచ్చారు. ఆయన వెంట హెచ్ఎం ఎస్.త్రినాథరావు ఉన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజాం సిటీ: స్థానిక చీపురుపల్లి రోడ్డులో ఈ నెల 25వ తేదీన విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతున్నట్లు ఏఈ కుమార్ ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. రోడ్డు విస్తరణలో భాగంగా విద్యుత్‌స్తంభాలు, వైర్లు మార్చనున్న నేపథ్యంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఈ అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

చిత్రలేఖనాన్ని హాబీగా మార్చుకోవాలి



వేసిన బొమ్మలు చూపిస్తున్న చిన్నారులు

తెర్లాం: ప్రతీ విద్యార్థి చిత్రలేఖనాన్ని హాబీగా మార్చుకోవాలని స్థానిక శాఖా గ్రంథాలయ అధికారి సీహెచ్.కృష్ణమూర్తి అన్నారు. గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో మంగళవారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. చిన్నారులతో వారికి నచ్చిన బొమ్మలు వేయించి వాటికి రంగులు దిద్దించారు. చదువుతోపాటు చిత్రలేఖనంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

20 మద్యం సీసాలు స్వాధీనం

బొబ్బిలి: మండలంలోని అలజంగిలో మద్యం విక్రయిస్తున్న వేటూరి తిరుపతిరావు అనే వ్యక్తిని మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద 20 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఈబీ సీఐ ఆర్.జైభీమ్ తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు పంపినట్లు చెప్పారు. దాడుల్లో ఎస్ఈబీ సిబ్బంది మాధవీదేవి, చంద్రప్రసాద్, ఆదినారాయణ ఉన్నారు.

ప్రచార జాతను జయప్రదం చేయండి

రాజాం సిటీ: మున్సిపల్ ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని కోరుతూ జూన్ 1వ తేదీన చేపట్టనున్న రాష్ట్ర ప్రచార జాతను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు కోరారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కాంట్రాక్ట్ ఉద్యోగులతో సమావేశమైన ఆయన 010 పద్దు కింద జీతాలు చెల్లింపు, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించి, రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు.

ప్రశాంతంగా ఏపీఈఏపీ సెట్ పరీక్షలు

రాజాం: స్థానిక జీఎంఆర్ఐటీలో ఏపీ ఈఏపీ సెట్ పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం జరిగిన పరీక్షకు 261 మందికి గాను 250 మంది, మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 263 మందికి 250 మంది విద్యార్థులు హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు.

ఆటపాటలతో బోధన

తెర్లాం: అంగన్‌వాడీ కేంద్రాల్లోని ప్రీస్కూల్ పిల్లలకు పౌష్టికాహారంతోపాటు ఆటపాటలతో కూడిన విద్య అందించాలని సీడీపీఓ కె.రాజ్యలక్ష్మి అన్నారు. మండలంలోని కుసుమూరు 1,2 అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రీస్కూల్ పిల్లల హాజరు, విద్యాబోధన, వండిన పౌష్టికాహారాన్ని, రికార్డులను, సరుకుల నిల్వలను పరిశీలించారు.

వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం



బొబ్బిలి: వలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి, తదితరులు

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు
- కళాభారతి ఆడిటోరియంలో వలంటీర్లకు సత్కారం
- వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ

బొబ్బిలి: గ్రామ వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. పట్టణంలోని కళాభారతి మున్సిపల్ ఆడిటోరియంలో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు అధ్యక్షతన చేపట్టిన ఈ కార్యక్రమంలో 331 మంది వలంటీర్లను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రేషన్ కార్డు కావాలన్నా, ఇళ్లు కావాలన్నా జన్మభూమి కమిటీలకు లంచాలు ఇవ్వాల్సి వచ్చేదన్నారు. కానీ ఇప్పుడు పార్టీలతో సంబంధం లేకుండా, అర్హతే ప్రమాణికంగా లబ్ధిదారుల ఇంటి వద్దకే వలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలను చేరవేస్తున్నామన్నారు. ఈ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 32 లక్షల మందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేసిందని అన్నారు. అలాగే గ్రామ సచివాలయాల్లో లక్షా 26 వేల మందికి ఉద్యోగాలు కల్పించడంతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల్లో వేల సంఖ్యలో ఉన్న ఖాళీలను భర్తీ చేసిందన్నారు. సుమారు 4 లక్షల మందిని వలంటీర్లుగా నిస్వార్థ సేవలందిస్తున్నారని, వారి సేవలను గుర్తిస్తూ ప్రభుత్వం నగదు ప్రోత్సాహకం, ప్రశంసాపత్రాలు అందించి సత్కరిస్తోందన్నారు. కార్యక్రమంలో బుడా చైర్‌పర్సన్ ఇంటి పార్వతి, జేసీఎస్ పట్టణ ఇన్‌ఛార్జి రేజేటి ఈశ్వరరావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు ఇంటి గోపాలరావు, రాష్ట్ర ఆర్థిక మండలి మాజీ సభ్యులు తూముల భాస్కరరావు, ఏఎంసీ వైస్ చైర్‌పర్సన్ తెంటు పార్వతి, మున్సిపల్ వైస్ చైర్మన్ చెలికాని మురళి, కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నేడు విజయరాంపురంలో..

తెర్లాం: మండలంలోని విజయరాంపురం(బూరిపేట) గ్రామంలో బుధవారం మండల స్థాయిలో వలంటీర్లకు సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి, జెడ్పీటీసీ గర్నాపు లూర్దు, వైస్ ఎంపీపీలు చేపేన సత్యనారాయణ, రమాదేవి, పలువురు ప్రజాప్రతినిధులు హాజరు కానున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి మండలంలోని అన్ని సచివాలయాల వలంటీర్లు, ఉద్యోగులు, మండల స్థాయి అధికారులు హాజరుకావాలని కోరారు.

సేవలే గుర్తింపునిస్తాయి..

వంగర: ప్రజలకు మనం చేసిన సేవలే మనకు మంచి గుర్తింపునిస్తాయని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ అన్నారు. మండలంలోని కొండచాకరాపల్లి గ్రామ సచివాలయంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం మంగళవారం నిర్వహించి, ఉత్తమ వలంటీర్లుగా ఎంపికైన పలువురిని సత్కరించారు. ప్రజలకు పారదర్శకంగా సంక్షేమ పథకాలు చేరవేయాలన్న సదుద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసిందని, ఈ వ్యవస్థకు దేశ వ్యాప్తంగా మంచి పేరుందన్నారు. ఇదే స్ఫూర్తితో మున్ముందు కూడా పనిచేసి, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ గౌయ్యమ్మ, ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు, ఈఓపీఆర్డీ ఎల్.త్రినాథులు తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని అంబాడ, కందిశ, ఉనుకూరు గ్రామ సచివాలయాల్లో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించి, ఉత్తమ వలంటీర్లను ఎంపీపీ దార అప్పలనరసమ్మ, వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావులు కలిసి సన్మానించారు. ఈ సత్కారం మరింత బాధ్యతను పెంచిందని భావిస్తున్నామని, భవిష్యత్‌లో కూడా ప్రభుత్వ ఆదేశానుసారం ప్రజలకు మరిన్ని సేవలందించాలని వారు వలంటీర్లను కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు జి.వెంకటేశ్వరరావు, సీహెచ్ వెంకటనాయుడు, కె.మన్మథరావు, ఎంపీడీఓ జి.కాశీవిశ్వనాథరావు, ఎంపీటీసీ బి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రాజాం: వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా మండలంలోని కంచరాం గ్రామ సచివాలయంలో ఉత్తమ వలంటీర్లుగా ఎంపికైన వారిని వైఎస్సార్ సీపీ రాజాం రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు మంగళవారం సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వలంటీర్లు సంక్షేమ రథసారథులని, చిత్తశుద్ధి, నిబద్ధతతో పనిచేసి, అర్హులకే ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.సుబ్బమ్మ, పార్టీ నేత జి.అప్పలనాయుడు, ఎంపీటీసీ రాంబాబు, ఎంపీడీఓ బి.శంకరరావు, పంచాయతీ కార్యదర్శి దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం రాజయ్యపేట గ్రామంలో కూడా వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించి, వలంటీర్లను సత్కరించారు.

రాజాం సిటీ: వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని బుచ్చింపేట, పొనుగుటివలస గ్రామ వలంటీర్లను మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు, వైఎస్సార్ సీపీ టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు కలిసి మంగళవారం సన్మానించారు. సేవలతో మంచి గుర్తింపు లభిస్తుందని, ఇదే స్ఫూర్తితో భవిష్యత్‌లో కూడా పనిచేయాలని కోరారు.



రేగిడి: ఉనుకూరులో సన్మానం అందుకున్న వలంటీర్లు



వంగర: వలంటీర్లను సన్మానిస్తున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ



రాజాం: కంచరాంలో వలంటీర్లను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు



రాజాం సిటీ: సన్మాన గ్రహీతలతో మున్సిపల్ కమిషనర్ కృష్ణారావు, పార్టీ రాజాం టౌన్ కన్వీనర్ శ్రీనివాసరావు

జాబ్‌కార్డులకు ఆధార్ సీడింగ్ చేయాలి



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ

తెర్లాం: ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న వేతనదారుల జాబ్‌కార్డులకు ఆధార్ సీడింగ్ చేయాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఉపాధిహామీ పథకం సాంకేతిక సహాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది మండలంలో ఉపాధిహామీ పథకం ద్వారా ఏయే గ్రామాల్లో ఉద్యానవన మొక్కలు వేశారు, రోడ్లుకు ఇరువైపులా ఎన్ని మొక్కలు నాటారు, వాటికి చెల్లించిన నిధుల వివరాలపై ఆరా తీశారు. మండలంలో చేపడుతున్న పనుల వివరాలు, వేతనదారుల హాజరు, రోజువారీ ఎంత వేతనం గిట్టుబాటు అవుతోందని క్లస్టర్ల వారీగా సాంకేతిక సహాయకులను అడిగి తెలుసుకున్నారు. వేతనదారులకు ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేయించి వారికి రోజువారీ వేతనం రూ.257లు పైనే వచ్చేలా చూడాలన్నారు. వేసవి ఎండలు ఎక్కువగా ఉన్నందున పని ప్రదేశంలో తప్పనిసరిగా క్షేత్ర సహాయకులు టెంట్లు ఏర్పాటు చేసేలా చూడాలని చెప్పారు. వేతనదారులు ఇంటి నుంచి వచ్చినప్పుడు తాగునీరు, మజ్జిక తెచ్చుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు.

అక్కచెల్లెమ్మలకు అండగా 'వైఎస్సార్ ఆసరా'

- ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి



సీఎం సందేశ పత్రాన్ని విడుదల చేస్తున్న ఎంపీపీ ఉమాలక్ష్మి, అధికారులు

తెర్లాం: స్వయం సహాయక సంఘాల్లో మహిళలకు వైఎస్సార్ ఆసరా పథకం ఎంతో బాసటగా నిలిచిందని ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి అన్నారు. ఈ పథకం కింద పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాసిన లేఖను ఎంపీడీఓ శంబంగి రామకృష్ణతో కలిసి మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ 2014 ఎన్నికల సమయంలో డ్వాక్రా సంఘాల రుణాలను మాఫీ చేస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ఆ హామీలను విస్మరించి మహిళలను మోసం చేశారని దుయ్యబట్టారు. కానీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీ ప్రకారం పొదుపు సంఘాల మహిళల కోసం సున్నా వడ్డీ, వైఎస్సార్ ఆసరా, నవరత్నాల పథకాలను అమలు చేసి మహిళా పక్షపాతిగా నిలిచారన్నారు. రానున్న ఎన్నికల్లో పొదుపు సంఘాల మహిళలంతా సీఎంగా జగన్‌కు మళ్లీ అవకాశం ఇవ్వాలని కోరారు. వెలుగు ఏపీఎం టి.రాము, వీఓఏలు ఉన్నారు.

ఘనంగా ముగ్గురమ్మల పండుగ



అంజలి రథం వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి, ఎంపీపీ లక్ష్మణరావు, తదితరులు

రామభద్రపురం: మండలంలోని కోటశిర్లాంలో గ్రామ దేవతలు పైడితల్లిమ్మ, కొత్తమ్మ, బంగారమ్మ తల్లి ఉత్సవాలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. సుమారు 30 ఏళ్ల తరువాత జరుగుతున్న ఈ ఉత్సవాల్లో కోలాటం, తప్పెటగుళ్లు, బిందెల డాన్స్, పులివేషాలు, విశాఖపట్నంకు చెందిన కండక్టర్ ఝాన్సి ఈవెంట్, భాగవతం, బుర్రకథ తదితర సాంస్కృతి కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఉత్సవాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనడంతో గ్రామంలో సందడి నెలకొంది. ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, ఎంపీపీ లక్ష్మణరావు, జెడ్పీటీసీ అప్పకొండ సరస్వతి, బొబ్బిలి మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, శంబంగి వేణుగోపాలనాయుడు తదితరులు ముగ్గురమ్మలను దర్శించుకుని పూజలు చేశారు.

విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను సత్కరిస్తున్న ఓల్డ్ ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు

రాజాం సిటీ: స్థానిక ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పలువురు విద్యార్థులను ఓల్డ్ ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం సన్మానించారు. సత్కారం అందుకున్న వారిలో జిల్లా స్థాయిలో ప్రథమస్థానం సాధించిన పొగిరి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన లెంక జగదీష్, తృతీయ స్థానం సాధించిన రాజాం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన రేగిడి అక్షిత ఉన్నారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, బీవీ అచ్యుత్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ప్రథమ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులు రాజాం ప్రాంతానికి చెందిన వారు కావడం చాలా గర్వంగా ఉందన్నారు. భవిష్యత్‌లో కూడా ఇదే క్రమశిక్షణతో విద్యనభ్యసించి, ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంఈఓ పి.నాగయ్య, హెచ్ఎం ఎస్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చెరకు పంట పరిశీలన



రేజేరులో చెరకు పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

బాడంగి: మండలంలోని రేజేరు గ్రామంలోని రైతు భరోసా కేంద్రాన్ని జిల్లా వ్యవసాయ శాస్త్రవేత్తలు తేజేశ్వరరావు, స్వాతి మంగళవారం సందర్శించారు. రైతులకు ఆర్‌బీకే సిబ్బంది అందిస్తున్న సేవలు, రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామంలోని రైతులు సాగుచేస్తున్న చెరకు పంటలను పరిశీలించారు. పీకపురుగు, అగ్గితెగులు లక్షణాలు ఉన్నట్లు గుర్తించి వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలను రైతులకు వివరించారు. ప్రొపికోనజోల్ మందును ఒక లీటరు నీటిలో ఒక మిల్లీగ్రాం, కార్బన్ హైడ్రో క్లోరైడ్ మందు కలిపి 20 లీటర్ల మందు ద్రావణాన్ని పంట మొత్తం తడిచేలా పిచికారీ చేయాలని సూచించారు. పచ్చిరొట్ట విత్తనాలు వేసుకున్న 45 రోజుల తరువాత నేలలో కలియదున్నాలని, తద్వారా నేల సారవంతం అయి పంటదిగుబడి బాగా వస్తుందని అన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

వంగర: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ హాజరు కానున్నారని, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులంతా హాజరుకావాలని ఆయన కోరారు.

నేడు సచివాలయ భవనం ప్రారంభం

రేగిడి: మండలంలోని చిన్నశిర్లాం గ్రామ సచివాలయ ప్రారంభోత్సవం బుధవారం జరుగుతుందని వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ హాజరుకానున్నారని తెలిపారు. మండలంలోని అన్ని పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నేతలు, కార్యకర్తలు హాజరై, కార్యక్రమం జయప్రదం చేయాలని కోరారు.

సీఎం సందేశ పత్రాల పంపిణీ

రాజాం: వైఎస్సార్ ఆసరా పథకానికి సంబంధించి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన సందేశ పత్రాలను మండలంలోని గడిముడిదాం గ్రామంలో మంగళవారం పంపిణీ చేశారు. వైఎస్సార్ ఆసరా పథకం మూడో విడత నగదు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ అయిందని, ఈ మేరకు సీఎం సందేశ పత్రాలను అందిస్తున్నామని వైఎస్సార్ క్రాంతి పథం ఏసీ చిరంజీవి తెలిపారు. మండలంలోని మొత్తం 1142 సంఘాలకు సంబంధించి, 10,490 మంది లబ్ధిదారుల ఖాతాల్లో రూ.8.38 కోట్ల నగదు జమ అయిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎల్.సులోచన, పార్టీ రాజాం రూరల్ కన్వీనర్ ఎల్.రాజగోపాలనాయుడు, సర్పంచ్ రమాదేవి, వైకేపీ ఏపీఎం దదికుమార్ పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన బోర్ల మరమ్మతులు

సంతకవిటి: వేసవి నేపథ్యంలో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేసింది. క్రాస్ ప్రోగ్రాంలో భాగంగా మండలంలోని వాసుదేవపట్నం, గోళ్లవలస, సంతకవిటి గ్రామాల్లో మరమ్మతులకు గురైన బోర్లను మంగళవారం యుద్ధప్రాతిపదికన బాగుచేసి, వినియోగంలోకి తీసుకువచ్చారు. అందరికీ తాగునీరు అందుబాటులో ఉండాలనే ఈ చర్యలు తీసుకుంటున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సంతోష్‌కుమార్ తెలిపారు.

ఏపీఓకు షోకాజ్ నోటీసు

మెంటాడ: ఉపాధిహామీ పథకం ఏపీఓకు షోకాజ్ నోటీస్ ఇచ్చినట్లు డ్వామా పీడీ ఉమాపరమేశ్వరి తెలిపారు. గత కొన్నిరోజులుగా బ్యాంకు ఖాతాలు లేకుండా ఆధార్ నంబరు జతచేసి బినామీ కార్డులను మంజూరు చేసినందుకు గాను ఏపీఓకు షోకాజ్ నోటీస్ ఇవ్వడం జరిగిందన్నారు. దీనిపై స్పష్టత ఇవ్వాలని కోరినట్లు చెప్పారు. ఈ విషయాన్ని ఏపీఓ చిన్నప్పయ్య వద్ద ప్రస్తావించగా పీడీ నుంచి షోకాజ్ నోటీస్ అందినట్లు స్పష్టం చేశారు.

వేతనదారుల సంఖ్య మరింత పెరగాలి

బొబ్బిలి: మండలంలోని అన్ని గ్రామాల్లో నిత్యం 10వేల మంది ఉపాధి వేతనదారులు పనులకు వెళ్తున్నారని, ఈ సంఖ్య 12వేలకు పెరగాలని ఎంపీడీఓ అల్లు భాస్కరరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వేతనదారులతో రెండు పూటలా పనులు చేయించాలని, గరిష్ట వేతనం లభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎండల నేపథ్యంలో పని ప్రదేశంలో టెంట్లు ఏర్పాటు చేయాలని, ఫస్ట్ ఎయిడ్ కిట్లు, తాగునీరు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



జయలక్ష్మిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జోగులు

రాజాం: స్థానిక ఎస్సీ చిన్న కాలనీకి చెందిన వైఎస్సార్ సీపీ మహిళా నేత అల్లెన జయలక్ష్మిని ఎమ్మెల్యే కంబాల జోగులు మంగళవారం కలిసి పరామర్శించారు. అనారోగ్యం కారణంగా కొన్నిరోజుల క్రితం ఆస్పత్రిలో చేరి, చికిత్స పొందిన ఆమె కోలుకున్న తర్వాత ఇంటికి చేరుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆమెను కలిసి, ఆరోగ్యంపై ఆరాతీశారు. త్వరగా కోలుకుని, పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాజాం టౌన్ కన్వీనర్ పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కొలతల ప్రకారం పనిచేస్తే గిట్టుబాటు వేతనం

సంతకవిటి: నిర్దేశిత కొలతల్లో పనిచేస్తే గిట్టుబాటు అయ్యే వేతనం లభిస్తుందని ఏపీఓ త్రినాధరావు తెలిపారు. మంగళవారం మండలంలోని ఎస్.రంగారాయపురం, గుళ్లసీతారాంపురం, తాలాడ గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించిన ఆయన వేతనదారులకు పలు సూచనలు చేశారు. వేసవి నేపథ్యంలో రోజుకు రెండు పూటలా చల్లగా ఉన్న సమయంలో పనిచేయాలన్నారు. వడదెబ్బ బారినపడకుండా జాగ్రత్త వహించాలన్నారు. పనిప్రదేశంలో తప్పనిసరిగా తాగునీరు, టెంట్లు, ప్రథమ చికిత్స కిట్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

రేగిడి: మండలంలోని పోరాం, ఉనుకూరు, కాగితాపల్లి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ జి.కాశీవిశ్వనాధరావు మంగళవారం పరిశీలించారు. బోగస్ మస్తర్లు వేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ పని కల్పించాలన్నారు. ఏపీఓ హరనాధరావు ఉన్నారు.

రాజాం: మండలంలోని గడిముడిదాం గ్రామంలో మంచినీటి కోనేరులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఏపీడీ శ్రీనివాసరావు మంగళవారం పరిశీలించారు. అమృత్ సరోవర్ పథకానికి ఎంపికైన ఈ చెరువును ఆధునీకరించనున్నట్లు ఆయన తెలిపారు. చెరువు చుట్టూ కంచె ఏర్పాటుతో పాటు ఆధునీకరణ పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎల్.సులోచన, ఏపీఓ సాయిరాం పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

బాడంగి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంగా బుధవారం నుంచి ఈ నెల 29 వరకు ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నాయని కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ వి.శంకరరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఫస్ట్‌ఇయర్ విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సెకండ్ ఇయర్ విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. విద్యార్థులు సమయానికి పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని, నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించేది లేదని స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

వినతిపత్రం అందజేత



మున్సిపల్ కమిషనర్ కృష్ణారావుకు వినతిపత్రం అందిస్తున్న పొనుగుటివలస గ్రామస్తులు

రాజాం సిటీ: మండలంలోని పొనుగుటివలస గ్రామంలో నిరుపయోగంగా ఉన్న సచివాలయ భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఇదే విషయమై మంగళవారం మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావును కలిసి, వినతిపత్రం అందించారు. ప్రస్తుతం అద్దె భవనంలో సచివాలయం నిర్వహిస్తున్నారని, దీంతో ప్రజాధనం వృథా అవుతోందన్నారు. తక్షణమే ప్రభుత్వం నిర్మించిన సచివాలయం ప్రారంభించి, వినియోగంలోకి తీసుకురావాలన్నారు. అలాగే సిబ్బంది సమయ పాలన పాటించడం లేదని ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఎస్.జగదీష్, ఆర్.తిరుపతిరావు, ఆర్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



రేగిడి గ్రంథాలయ సందర్శనలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శంకరరావు

రేగిడి: సమ్మర్ క్యాంప్‌లో భాగంగా గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి.శంకరరావు కోరారు. స్థానిక శాఖా గ్రంథాలయాన్ని మంగళవారం సందర్శించిన ఆయన విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు అనే తేడా లేకుండా అందరూ గ్రంథాలయానికి రావచ్చని, ఇక్కడ ఉండే మంచి మంచి పుస్తకాలు చదివి జ్ఞానం పెంపొందించుకోవాలని తెలిపారు. వేసవి సెలవుల్లో విద్యార్థులకు విజ్ఞానం, వినోదం పంచడమే లక్ష్యంగా వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ బగాది వెంకటరమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు రాజాంలో గడప గడపకు..

రాజాం: పట్టణంలోని మల్లిఖార్జున కాలనీలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. ఉదయం 7 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కంబాల జోగులు పాల్గొంటారని, మండల స్థాయి నేతలు, కార్యకర్తలంతా హాజరు కావాలని కోరారు.